క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



గంగయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుబ్రహ్మణ్యం

పొదలకూరు (ముత్తుకూరు) : మండలంలోని ఈపూరు పట్టపుపాళేనికి చెందిన కోలంగారి గంగయ్య అనే దివ్యాంగుడు పక్షవాతంతో కొద్దిరోజులుగా నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ పర్రి సుబ్రహ్మణ్యం శనివారం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వేలిముద్ర వేయించుకుని గంగయ్యకు పింఛన్ సొమ్ము అందజేశారు.

వెటర్నరీ అసిస్టెంట్ల నియామకం

మనుబోలు : మండలంలోని మనుబోలు-1, మడమనూరు, చెరుకుమూడి గ్రామాల్లో ముగ్గురు పశుసంవర్ధక సహాయకులను ప్రభుత్వం నియమించింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసాద్‌కు నియామక పత్రాలు అందజేసి వారు శనివారం బాధ్యతలు చేపట్టారు. మనుబోలు-1కు ఎస్ ఎం.నివేదిత, మడమనూరుకు కె.కామాక్షమ్మ, చెరుకుమూడికి కె.కల్యాణి నియమితులయ్యారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ



నెల్లూరు(బృందావనం): నగరంలోని సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు రామావఝుల శ్రీనివాసులుశర్మ ఆధ్వర్యంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. రాత్రి ఆదిదంపతులను విశేషంగా అలంకరించి పల్లకిసేవ జరిపారు. శ్రీరాజరాజేశ్వరి నృత్యనికేతన్‌కు చెందిన వేదాంతం విధుమౌళి శిష్యబృందం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో అలరించారు. భక్తులు విశేషంగా హాజరై దేవదేవేరులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా డీవీఎస్ గిరి, పద్మజ దంపతులు వ్యవహరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు ఎస్సీ బాలాజిసింగ్, జీసీ ధర్మసింగ్, కార్యనిర్వహణాధికారి బొగ్గల మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు.

నారీసమ్మాన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బృందావనం) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) నెల్లూరు మహిళా విభాగం ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన మహిళల నుంచి నారీ సమ్మాన్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జేసీఐ అలుమిని క్లబ్ అధ్యక్షుడు కోటా సత్యం, నెల్లూరు ఏంజిల్స్ కార్యదర్శి కే విశ్వమైత్రి తెలిపారు. శనివారం సంతపేటలోని జేసీఐ కార్యాలయంలో అవార్డులకు సంబంధించిన బ్రోచర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన 18 ఏళ్లు పైబడిన వారు పురస్కారాలకు అర్హులని తెలిపారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో ఈ నెల 11న సాయంత్రం 6గంటలకు జరిగే సభలో పురస్కాలను అందజేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్, సభ్యులు ఎం రమణి, బిందుమాధవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

నెల్లూరు (టౌన్) : పొదలకూరురోడ్డులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యవస్థాప మనస్తత్వ అభివృద్ధిపై జిల్లా స్థాయి పోటీలను శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు పలు నమూనా ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. అందులో పది ఉత్తమ ప్రాజెక్టులను అధికారులు ఎంపిక చేశారు. వాటిలో లింగసముద్రం ఏపీఆర్‌డబ్ల్యూఎస్ విద్యార్థులు కవిత, సుస్మా, లక్ష్మీప్రసన్న రూపొందించిన రీయూజింగ్ వేస్ట్ క్లాత్స్ అండ్ ఎకో ఫ్రెండ్లీ పెన్స్ ప్రథమ స్థానం, కావలి మండలం ముసునూరు జిల్లా పరిషత్ కేహెచ్‌బీఆర్ విద్యార్థులు శ్రీజ, గాయత్రి, నిరూప రూపొందించిన పేపరు రీసైక్లింగ్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ప్రాజెక్ట్ ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్, అఫ్లటూన్ ఇంటర్నేషనల్, రీప్ బెనిఫిట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో డీఈఓ రామారావు, ఈఎండీపీ మేనేజర్ అనిత, కందుకూరు, నెల్లూరు, కావలి డిప్యూటీ ఈఓలు శ్రీనివాసులు, ప్రసన్నలక్ష్మి, రఘురామయ్య, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, స్కూల్ హెచ్‌ఎం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాటిపర్తిలో ప్రగతి పుంతలు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారిన రూపురేఖలు
- నాలుగేళ్లలో మునుపెన్నడూ జరగని అభివృద్ధి
- రూ.4.20 కోట్లతో సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్లు
- డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.29 కోట్ల పంపిణీ



సన్నటి వీధిలో కూడా నిర్మించిన సిమెంటురోడ్డు



పొదలకూరు : మండల పరిధిలో పొదలకూరు తర్వాత పెద్ద పంచాయతీ తాటిపర్తి. పెన్నార్ డెల్టా గ్రామమైనప్పటికీ గత పాలకులు పెద్దగా పట్టించుకోలేదు. ఫలితంగా గ్రామానికి సరిపడా అభివృద్ధి పనులు జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాకాణి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే గ్రామంలో అభివృద్ధి పుంతలు తొక్కింది. బిట్-1 సచివాలయ పరిధిలోనే పెద్ద ఎత్తున సంక్షేమ, అభివృద్ధి పనులు పూర్తయింది. సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్లకు రూ.4.20 కోట్లు వెచ్చించి పనులు పూర్తి చేశారు. బడి, గుడి, సంక్షేమ పథకాలు, తాగునీరు తదితర మౌలిక వసతులను పూర్తి చేశారు.

మెయిన్ సెంటర్‌లో..

తాటిపర్తి పెద్ద గ్రామం కావడం వల్ల ఊర్లో సచివాలయ నిర్మాణానికి స్థలం లభించలేదు. గ్రామ పెద్దలు యోచించి గ్రామస్తులందరికీ అనుకూలమైన స్థలాన్ని సాధించగలిగారు. నడి బస్టాండ్‌లో సచివాలయ నిర్మాణానికి స్థలం లభించడంతో చక్కటి భవనాన్ని పూర్తి చేసుకుని మంత్రి చేతుల మీదుగా ప్రారంభమైంది. విలేజ్ హెల్త్‌క్లినిక్ కూడా మెయిన్‌రోడ్‌లోనే నిర్మించడం విశేషం. ఆర్బీకే భవన నిర్మాణం, నాడు-నేడులో భాగంగా పాఠశాలకు రూ.80 లక్షలు వెచ్చించి మరమ్మతులు, జల్‌జీవన్ మిషన్లో భాగంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ కింద రూ.22 లక్షల నిధులు మంజూరు చేయించుకున్నారు. గతంలో గ్రామంలో తాగునీటి ఎద్దడి ఉండేది. అయితే ఇప్పుడు అలాంటి కష్టాలు లేకుండా గ్రామస్తులకు తాగునీరు అందుతోంది. గ్రామంలో సైడ్‌డ్రెయిన్లు లేక మురుగునీరు వెళ్లేది కాదు. రోడ్లపైనే మురుగునీరు ప్రవహించడం వల్ల జనాలు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు రూ.1.50 కోట్లు వెచ్చించి మురుగు కాలువల నిర్మాణం చేశారు. భూహక్కు పట్టాలు, జగనన్న కాలనీలో నివేశన స్థలాలను పేదలకు అందజేశారు. దీంతో ప్రజలు ఎలాంటి సమస్యల్లేని సంతోష జీవనాన్ని సాగిస్తున్నారు.

తాటిపర్తి బిట్-1 సచివాలయ పరిధిలో..
డీబీటీ లబ్ధిదారులు 6,567 మంది
జమ అయిన నగదు రూ.21,63,48,416
నాన్‌డీబీటీ లబ్ధిదారుల సంఖ్య 2,417
నగదు రూపంలో 7,52,04,714



విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం



గ్రామంలో వేసిన సీసీ డ్రెయిన్



తాటిపర్తి బిట్-1 సచివాలయ భవనం

వాడవాడలా సిమెంటురోడ్లు



గ్రామంలో వాడవాడలా సిమెంటురోడ్ల నిర్మాణం జరిగింది. గతంలో వర్షం కురిస్తే అనేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు అలాంటి తిప్పలు తప్పాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి కృషి వల్ల సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం జరిగింది.

– సాన పద్మమ్మ, తాటిపర్తి

సంక్షేమ పథకాలు భేష్



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు బేషుగ్గా ఉన్నాయి. సచివాలయానికి వెళ్లి డిస్‌ప్లే పరిశీలిస్తే మా గ్రామానికి ఇన్ని పథకాలు అందాయనే ఆశ్చర్యం వేస్తోంది. సీఎం జగన్ సుస్థిరపాలన వల్లనే సాధ్యమైంది.

– కొమర రమణయ్య, గ్రామస్తుడు, తాటిపర్తి

మంత్రి కాకాణి చొరవతో సాధ్యం



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ వల్లనే గ్రామంలో అభివృద్ధి పనులు సాధ్యమయ్యాయి. అడిగిన వెంటనే నిధులు కేటాయించి వెంటపడి పనులు చేయించారు. ఆయన రుణం ఎన్నికల్లో తీర్చుకుంటాం.

– పామూరు లచ్చారెడ్డి, ఉప సర్పంచ్, తాటిపర్తి

వేగంగా పనులు చేశాం



సచివాలయ భవనం, విలేజ్ హెల్త్‌క్లినిక్, సీసీరోడ్లు తదితర పనులు చాలా వేగంగా పూర్తి చేశాం. గ్రామస్తుల సహకారం వల్లనే సకాలంలో పనులను చేయించగలిగాం.

– ప్రసాద్, పీఆర్ ఏఈ, పొదలకూరు

బీసీ సంఘ జాయింట్ సెక్రటరీగా వెంకటేశ్వర్లు



మంత్రిని కలిసిన బీసీ సంఘ నేత

పొదలకూరు : నెల్లూరు జిల్లా బీసీ సంఘం జాయింట్ సెక్రటరీగా మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన వై.వెంకటేశ్వర్లుగౌడ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం రాత్రి నెల్లూరు క్యాంపు కార్యాలయంలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

వైభవంగా పల్లకిసేవ



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల పల్లకిసేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి



ఇందుకూరుపేట : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఇందుకూరుపేట : జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని అందరూ కలిసి విజయవంతం చేయాలని, ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కిశోర్‌కుమార్, బ్రహ్మేశ్వర నాయుడు కోరారు. జగదేవిపేట గ్రామంలో విద్యార్థులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 29 కేంద్రాల ద్వారా 2,583 మంది ఐదేళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. ఆదివారం(నేడు) ఉదయం ఎనిమిది నుంచి కార్యక్రమం ప్రారంభమవుతాయని వైద్యాధికారులు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, ఫార్మసిస్ట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి



కోవూరు : ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కోవూరు : మండలంలోని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం పల్స్‌పోలియోకు సంబంధించి వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులతో ఇనమడుగు పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఇందుకు తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పల్స్‌పోలియో కార్యక్రమం జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో మొత్తం 7,408 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 70 కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఒక మొబైల్ టీమ్ మండలంలో తిరుగుతూ ఉంటుందన్నారు.

ఈవీఎంలపై అపోహలొద్దు



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న రవికుమార్‌రెడ్డి

మనుబోలు : ఈవీఎంలపై ఎలాంటి అపోహలు వద్దని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ, ఈవీఎంల ట్రైనర్ రవికుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొలనకుదురు, కట్టువపల్లి, బద్దెవోలు, పిడూరుపాళెం, వెంకన్నపాళెం గ్రామాల్లో ఈవీఎంలపై శనివారం అవగాహన కల్పించారు. ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలి, ఏ బటన్ నొక్కితే ఏ గుర్తు పడుతుంది.. తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈవీఎం ద్వారా ఓటు వేస్తే ఒకే గుర్తుకు ఓటు పడుతుందనే అపోహలు ప్రచారంలో ఉన్నాయని, అది వాస్తవం కాదని తెలిపారు. అనంతరం ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో వీఆర్వోలు భగవాన్, నాగేశ్వరరావు, వీఆర్‌ఏ రమేష్, బీఎల్‌ఓలు నరేష్, సురేష్, మురళీకృష్ణ, యాసర్, బాబురావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు బూత్ కమిటీ సమావేశం

- హాజరు కానున్న మంత్రి కాకాణి

పొదలకూరు : పట్టణంలోని పీవీఎస్ కల్యాణ మండపంలో సర్వేపల్లి నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశం ఆదివారం సాయంత్రం నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి శనివారం తెలిపారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరు అవుతారని, అందరూ తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా సూచించారు.

పొదుపు మహిళల సర్వసభ్య సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పొదుపు మహిళల సర్వసభ్య సమావేశం నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడారు. పొదుపు గ్రూపులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు కృషి చేస్తానని వివరించారు.

సరోజినీ నాయుడికి ఘన నివాళి



సరోజినీ నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆశ్రమ సభ్యులు

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడులో ఉన్న పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి సరోజినీ నాయుడు వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆశ్రమ కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆమె సేవలు అభినందనీయమన్నారు. మహిళలకు విద్య అవసరమని దేశమంతా తిరిగి సమావేశాలు ఏర్పాటు చేసి చైతన్యం తీసుకొచ్చారని వివరించారు. తొలుత ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం దయాకర్‌రెడ్డితో కలిసి ఆశ్రమ ఆవరణలోని గాంధీజీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

7న వాహన వేలం

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వాడుకలో ఉన్న స్వరాజ్ మజ్దా 2008 మోడల్ వాహనాన్ని (ఏపీ13 ఎన్ 2797)ను ఈ నెల 7న వేలం వేయనున్నట్లు జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కే సదారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు ముందస్తుగా రూ.25వేలు ధరావత్తును జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి, నెల్లూరు వారి పేరున డిమాండ్ డ్రాఫ్టు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. డిమాండ్ డ్రాఫ్టను ఈ నెల 6న సాయంత్రం 5 గంటలలోగా ఆడియో వీడియో సూపర్‌వైజర్‌కు అందజేసి తగిన రసీదు పొందాలని సూచించారు. వేలంలో వాహనాన్ని దక్కించుకున్న వారు అదే రోజు పూర్తి నగదుతో పాటు 18 శాతం జీఎస్టీ చెల్లించి స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 96184 32664 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన టంగుటూరు



ఎమ్మెల్యే ప్రసన్నకు పుష్పగుచ్ఛం ఇస్తున్న టంగుటూరు మల్లికార్జునరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వవ్వేరు కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన టంగుటూరు మల్లికార్జునరెడ్డి శనివారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. తనను చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు రుణపడి ఉంటానని వివరించారు. ఆయన వెంట బుచ్చిరెడ్డిపాళెం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

గుమ్మలదిబ్బలో అధికారుల తనిఖీలు



స్థానికులతో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

కోవూరు : మండలంలోని గుమ్మలదిబ్బ గ్రామంలో పశుసంవర్ధక శాఖ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. ఇటీవల ఈ గ్రామంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ రావడం వల్ల దాదాపు 400పైగా కోళ్లను ఖననం చేశారు. ఇంకా ఏమైనా కోళ్లు ఉన్నాయా అని తెలుసుకోవడం కోసం పశుసంవర్ధక శాఖ అధికారులు బృందంగా ఏర్పడి మరోసారి తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేపట్టారు. గ్రామస్తులు మూడు నెలల పాటు చికెన్, కోడిగుడ్లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కోవూరు ఈఆర్వో శ్రీనివాసులు

కోవూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ఆయా మండలాల తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లతో శనివారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మౌలిక సదుపాయాలు ఉన్నాయా.. లేదా అని తెలుసుకోవాలన్నారు. అదేవిధంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో గత ఎన్నికల్లో ఏమైనా రీపోలింగ్ జరిగిందా.. పది శాతం కంటే తక్కువ పోలింగ్ జరిగిందా అనే విషయాలను కూడా సెక్టోరియల్ అధికారుల ద్వారా సమాచారం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా క్లెయిమ్‌ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో పరిష్కరించేలా ఆయా మండలాల తహసీల్దార్లు కృషి చేయాలని తెలియజేశారు. ఈ సమావేశంలో ఐదు మండలాల తహసీల్దార్లు జె.విజయశ్రీ, సీహెచ్ శ్రీనివాసరావు, శైలేంద్రకుమార్, జి.రమేష్‌కుమార్, టి.సురేష్ బాబు, బుచ్చిరెడ్డిపాళెం కమిషనర్ రమణబాబు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం



కోవూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



వెంకటాచలం: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

కోవూరు : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మండల పరిధిలో శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కోవూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 336 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 15 మంది గైర్హాజరైనట్లు పరీక్షల అధికారి షఫియాబాను తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

259 మంది హాజరు

వెంకటాచలం: వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 259 మంది హాజరయ్యారు. మొత్తం 266 మంది విద్యార్థులకు గానూ, 259 మంది హాజరై, ఏడుగురు గైర్హాజరయ్యారు.

మాస్ కాపీయింగ్‌పై ఆరోపణలు

వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరుగుతోందని పలువురు విద్యార్థులు ఆరోపించారు. ఈ విషయం ఎగ్జామినేషన్ విధులు నిర్వర్తించే వారికి, పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. దీనిపై ఎగ్జామినేషన్ చీఫ్ రత్నంను వివరణ కోరగా ఈ కేంద్రంలో అలాంటిదేమీ జరగడం లేదని, పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.